RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శనివారం 6-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 250 | పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
అర్హతలు:
- పత్రికారంగంలో ఆసక్తి కలిగి ఉండాలి.
- తెలుగు భాషపై పట్టు ఉండాలి.
- రిపోర్టింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.
- స్థానిక సంఘటనలు వెలికితీసే అవగాహనం ఉండాలి.
- సమాజ సేవ చేయగల ఉత్సాహం ఉండాలి.
- అనుభవం లేనివారికి శిక్షణ ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386

## మారుదాం... మార్చుదాం..!

- ఇదే నా రాజకీయ ఉద్యమ నినాదం
- నేటి నుంచి సరికొత్త రాజకీయయాత్ర ఆరంభిస్తున్నా
- తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలై ప్రకటన
- పార్టీకి గుడ్‌బై: రాజీనామా ఆమోదం



2లో

## తమిళనాడులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్..

- హైదరాబాద్ గండిపేట పరిధిలో భూ కబ్జా కేసు
- తమిళనాడు కాంచీపురంలో బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్
- కోర్టులో ప్రవేశ పెట్టేందుకు హైదరాబాద్ పోలీసుల ఏర్పాట్లు



2లో

# కేసీఆర్ చర్చకు అసెంబ్లీకి రా..

## పాలమూరు ప్రాజెక్టులపై కేసీఆర్‌ను నిలదీసిన సీఎం



- రూ.8 వేల కోట్లతో జిల్లాలో అభివృద్ధి పనులు: రేవంత్
- పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సవాల్
- 2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం.. 'ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్' నినాదం
- పాలమూరు ప్రాజెక్టుల పూర్తి కోసం సీఎం రేవంత్ ప్రత్యేక కార్యాచరణ
- గూడెందొడ్డిలో 15 టీఎంసీల నీటి నిల్వకు కర్ణాటకతో చర్చలు
- బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ రంగం దెబ్బతిందన్న ఉత్తమ్
- ధాన్య సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్: మంత్రి ఉత్తమ్

జడ్చర్లలో నిర్వహించిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డగా గత రెండు రోజులుగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించానని తెలిపిన ఆయన, వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు అనుభవించిన ఈ గడ్డపై గతంలో కేసీఆర్‌కు ఇక్కడ ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా రాజకీయ వలస వచ్చాడని, అయినప్పటికీ ఇక్కడి ప్రజలు ఆయన్ను గుండెల్లో పెట్టుకున్నారని గుర్తుచేశారు. ఒక తల్లిగా ఇక ఏ తల్లికి గుండెకోత ఉండొద్దనే ఉద్దేశంతోనే సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, కానీ కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రెండుసార్లు ఆయన చేతిలో పెడితే.. పదేళ్ల పాలనలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని సీఎం మండిపడ్డారు. పాలమూరులో గెలిపించినందుకు ఇక్కడి ప్రాజెక్టులు పూర్తి చేయకుండా పారిపోయి గజ్వేల్‌లో పోటీ చేసిన కేసీఆర్ పాలమూరు ద్రోహినా? లేక ఇక్కడే పుట్టి పెరిగిన నేను ద్రోహినా? అని నిలదీశారు. పదేళ్లలో కాళేశ్వరం కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్, ఉద్దండపూర్ మునిగిపోతుంటే నిర్వాసితుల కోసం రూ. 800 కోట్లు ఇవ్వలేదని, పైగా

- మిగతా 2వ పేజీలో



## ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటాలి

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేళ పవన్ కల్యాణ్ పిలుపు
- మూలపాడులోని బటర్ ఫ్లై పార్కులో తెల్ల పొనికి మొక్కను నాటిన పవన్
- తన తల్లి అంజనా దేవికి అంకితం ఇస్తూ మొక్క నాటిన వైనం
- 2.5 కోట్ల సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం

పపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక వినూత్నమైన, అర్థవంతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అటు పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఇస్తూనే... ఇటు ఒక భావోద్వేగపూరితమైన వ్యక్తిగత స్పర్శతో ఆయన తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఎన్టీఆర్ జిల్లాలోని మూలపాడు 'బటర్ ఫ్లై పార్క్' (సీతాకోకచిలుకల పార్క్)ను సందర్శించిన పవన్ కళ్యాణ్... అక్కడ ఎంతో అరుదైన, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన 'తెల్ల పొనికి' మొక్కను నాటారు. ప్రపంచప్రసిద్ధి చెందిన కొండపల్లి బొమ్మల తయారీకి ఈ తెల్ల పొనికి కర్రనే ఉపయోగిస్తారు.



## ఏపీలో స్మార్ట్ సిటీలు.. రష్యాలో మంత్రి లోకేష్ కీలక భేటీ


- సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వ అధికారితో మంత్రి లోకేష్ భేటీ
- సేఫ్ అండ్ స్మార్ట్ సిటీల ఏర్పాటుపై కీలక చర్చలు
- డిజిటల్ విద్య, మౌలిక సదుపాయాలపై ప్రధానంగా దృష్టి
- ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు ఇరుపక్షాల నిర్ణయం

2లో

# ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి

- బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు వెల్లడి
- అమరావతి నుంచి నెల్లూరు వరకు ఆక్వా కారిడార్ అభివృద్ధికి ప్రణాళిక
- భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో ఏపీ వాటా 38 శాతం అని వెల్లడి
- ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ
- 'ఆంధ్రా ప్రింప్.. ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్ స్థాపించాలని పిలుపు

భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదేనని, భారతదేశ బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం



## డీఎస్సీపై ప్రభుత్వం ఫుల్ క్లారిటీ.. హారిజాంటల్ రిజర్వేషన్‌పై సుదీర్ఘ వివరణ


- డీఎస్సీ నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్ పై ప్రభుత్వ సమగ్ర వివరణ
- జీవో 77 ప్రకారమే పోస్టుల భర్తీ, సుప్రీంకోర్టు ఆదేశాల అమలు అని వెల్లడి
- వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ల మధ్య తేడాను ఉదాహరణలతో స్పష్టం చేసిన అధికారులు
- స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా ఎంపికలు నిబంధనల ప్రకారమే జరిగాయని వెల్లడి
- కాల్ లెటర్ వస్తే ఉద్యోగం వచ్చినట్లు కాదు, అది కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసమేనని స్పష్టీకరణ

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో తెలంగాణ నీటి హక్కులు



- ఎత్తిపోతల పంపులపై నిర్లక్ష్యం.. ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం
- కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ 25 శాతానికే పరిమితం
- రైతు డిస్కమ్ ప్రతిపాదనను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

2లో



## ఎస్‌యూ--57 జెట్‌ను జట్టుగా తయారుచేద్దాం!

- అత్యాధునిక ఐదోతరం స్టెల్త్ విమానం తయారీపై భారత్‌కు పుతిన్ భారీ ఆఫర్
- సంయుక్తంగా దేశీయంగా ఉత్పత్తి చేద్దామని ప్రతిపాదన
- భారత వైమానికదళం బలోపేతానికి కృషిచేస్తామని ప్రతిన

# ఎస్‌యూ--57 జెట్‌ను జట్టుగా తయారుచేద్దాం!

సెయింట్ పీటర్స్‌బర్గ్: చిరకాల మిత్రదేశం భారత్‌కు తమ శక్తివంతమైన అత్యాధునిక యుద్ధవిమానాలను సైతం ధారాదత్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. దీంతో భారత వైమానికదళం మరింత పటిష్టవంతమయ్యేందుకు పుతిన్ భారత్‌కు భారీ ఆఫర్ ఇచ్చారు. రష్యాలో రెండో అతిపెద్ద నగరం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో భేటీలో పుతిన్ సుదీర్ఘంగా మాట్లాడారు. రష్యా అభివృద్ధిచేసిన ఐదో తరం స్టెల్త్ రకం 'ఎస్‌యూ 57'జెట్‌ను భారత్‌తో కలిసి దేశీయంగా మరింత అధునాతనంగా తీర్చిదిద్దేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పుతిన్ వెల్లడించారు. "ఎస్‌యూ--57 రకం యుద్ధవిమానాన్ని మరింత అధునాతనంగా భారత్‌తో కలిసి, భారత్‌లో తీర్చిదిద్దేందుకు రష్యా సిద్ధంగా ఉంది. నిజానికి ఈ విమానాన్ని మేం సొంతంగా అభివృద్ధిచేశాం. కానీ ఇప్పుడు మిత్రదేశం భారత్‌లో తయారుచేసేందుకు ఆశపడుతున్నాం. ఈ విమానం విషయంలో ఎలాంటి షరతులు విధించదల్చుకోలేదు"అని అన్నారు. "సమీకృత గగనతల రక్షణ వ్యవస్థల అభివృద్ధిలోనూ భారత్‌ను భాగస్వామిగా చేర్చుకోవాలని భావిస్తున్నాం. ఇతర యుద్ధరంగ ఉపకరణాల తయారీని సంయుక్తంగా ఆరంభిద్దాం. దీనిపై ఆలోచిస్తామని భారత్ గతంలోనే మాకు సమాచారం ఇచ్చింది"అని పుతిన్ వెల్లడించారు. పుతిన్ ఆఫర్‌పై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌దీర్ జైశ్వాల్ స్పందించారు. "రక్షణ రంగ సంబంధం అంశంలో మీకు అదనపు సమాచారం కావాలంటే రక్షణమంత్రిత్వ శాఖనే బదులు ఇవ్వగలదు"అని ఆయన అన్నారు. అంతర్జాతీయంగా మారిన రాజకీయకచిగోళిక పరిస్థితులు, ఉక్రెయిన్, పశి?చమాసియా యుద్ధాలతో భారత్ రక్షణ ఉత్పత్తుల సరఫరాలో తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంది. ముఖ్యంగా ఐదో తరం యుద్ధవిమానం కోసం వెతికి విసిగిపోయి చివరకు సొంతంగా తయారుచేయాలని నిశ్చయించుకుంది. ఇందులోభాగంగా ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక బహుళార్థ యుద్ధవిమాన(ఏఎంసీఏ) ప్రాజెక్టుకు శ్రీకారంచుట్టింది. అయితే 2035లోపు ఈ విమానం అందుబాటులోకి వచ్చే అవకాశాలులేకపోవడంతో పుతిన్ ఆఫర్‌ను భారత్ అంగీకరించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. "చైనా, భారత్ మధ్య సున్నితమైన ద్వైపాక్షిక సంబంధాల్లో రష్యా ఎన్నడూ జోక్యంచేసుకోలేదు. ఇకమీదటా కలగజేసుకోబోం. రెండు దేశాలతో రష్యా సంబంధాలు సహజమైనవి. సరిహద్దు అంశం సహా వివాదాస్పద అంశాలన్నింటినీ ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నా. భారత్--రష్యా బంధం చైనాను ఇబ్బంది పెట్టదు. అలాగే రష్యా--చైనా బంధం భారత్‌ను ఇబ్బందిపెట్టదు. భారత్--పాకిస్తాన్ సరిహద్దు విషయంపై చైనా, రష్యాకు స్పష్టమైన అవగాహన ఉంది. ఇక పాకిస్తాన్ అనేది చైనా కనుసన్నల్లో నిర్ణయాలు తీసుకుంటోందని నేను భావించట్లేను"అని అన్నారు .

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో తెలంగాణ నీటి హక్కులు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతోందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల మోటార్ల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యంతో కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులు దెబ్బతింటున్నాయని చెప్పారు. ఈ మేరకు హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. 'లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో భారీ మోటార్లను పదేపదే ఆన్ ఆఫ్ చేయడం వల్ల పరికరాలు దెబ్బతింటాయని మేము ముందుగానే హెచ్చరించినా, చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రాజెక్టులను బలహీనపరచి ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం జరుగుతుందనే అనుమానం కలుగుతోంది. కృష్ణా, గోదావరి నదుల నుంచి తెలంగాణకు రావాల్సిన నీటిని కాళేశ్వరం, దేవాదుల, పాలమూరు ఇతర ప్రాజెక్టు ద్వారా పూర్తిగా వినియోగించుకోవడం లేదు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాల వినియోగం కనిష్ట స్థాయికి పడిపోయింది. కృష్ణా జలాల్లో తెలంగాణ తాత్కాలిక వాటా 34 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు వాటా 66 శాతం. 2025--26లో ఏపీ వినియోగం 74.90 శాతానికి పెరగ్గా తెలంగాణ వినియోగం ఎన్నడూ లేనంత అత్యంత కనిష్ట స్థాయిలో 25.10 శాతానికి పడిపోయింది. తెలంగాణ జల హక్కులు, రైతుల ప్రయోజనాలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి ఇది మరో నిదర్శనం'అని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.


# డీఎస్సీపై ప్రభుత్వం ఫుల్ క్లారిటీ.. హారిజాంటల్ రిజర్వేషన్‌పై సుదీర్ఘ వివరణ

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలపై అభ్యర్థులు, మీడియా, సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్న సందేహాలు, ఆరోపణలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, శాప్ ఎండీ భరణి తదితర ఉన్నతాధికారులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి నియామకం నిబంధనల మేరకే జరిగిందని, ఎక్కడా ఎలాంటి అక్రమాలకు తావులేదని తేల్చిచెప్పారు. ముఖ్యంగా, హారిజాంటల్ రిజర్వేషన్ విధానంపై చాలా మందికి సరైన అవగాహన లేకపోవడం వల్లే ఈ అపోహలు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రెండు రకాల రిజర్వేషన్లు అమలవుతాయని అధికారులు వివరించారు. అవి వర్టికల్ (నిలువు) మరియు హారిజాంటల్ (అడ్డం) రిజర్వేషన్లు. వర్టికల్ రిజర్వేషన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వంటి సామాజిక వర్గాలకు కల్పించే రిజర్వేషన్‌ను వర్టికల్ రిజర్వేషన్ అంటారు. దీనికోసం 100 పాయింట్ల రోస్టర్ విధానం అమల్లో ఉంటుంది. ఇందులో ప్రతి కేటగిరీకి నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు కేటాయించి ఉంటాయి. ఈ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో కూడా పోటీ పడవచ్చు. దీనివల్ల కొన్నిసార్లు ఆయా వర్గాలకు నిర్దేశించిన శాతం కంటే ఎక్కువ మంది ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. హారిజాంటల్ రిజర్వేషన్: మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడాకారులు వంటి ప్రత్యేక కేటగిరీలకు కల్పించేది హారిజాంటల్ రిజర్వేషన్. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం, ఈ కేటగిరీలకు నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు ఉండవు. మొత్తం నియామకాల్లో నిర్దేశిత శాతం (ఉదాహరణకు మహిళలకు 33.3%) ఉండేలా చూడటమే దీని ఉద్దేశం.

# ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగ అభివృద్ధికి తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. భారతదేశ సముద్ర ఆహార ఉత్పత్తిలో, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు గణాంకాలతో వివరించారు. "దేశ మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతం, రొయ్యల ఉత్పత్తిలో ఏకంగా 66 శాతం మనదే. దేశ సముద్ర ఆహార ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో 38 శాతం, అంటే సుమారు రూ.28,000 కోట్లకు పైగా ఏపీ నుంచే సమకూరుతోంది. ప్రపంచ సీ-ఫుడ్ వ్యాపారంలో భారత్ వాటా కేవలం 5 శాతమే ఉంది. దీన్ని పెంచడానికి అపార అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, దేశ ఎగుమతులు కూడా వృద్ధి చెందుతాయి" అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆక్వా రంగం సమగ్రాభివృద్ధికి ఒక బృహత్ ప్రణాళికను చంద్రబాబు ప్రకటించారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఒక 'ఆక్వా కారిడార్' అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. "ఈ కారిడార్‌లో పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు,



ఆధునిక టెక్నాలజీతో కూడిన ఒక సమగ్ర ఎకో సిస్టం ఏర్పాటు చేస్తాం. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే మా లక్ష్యం. 'పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్' అనే విధానంతో ముందుకు సాగుతాం" అని తెలిపారు. 'ఆంధ్రా రొయ్య... ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు రాష్ట్రం పూర్తి సహకారం అందిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు 15 రోజుల్లోగా అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. కాకినాడ పోర్టు ఆధునికీకరణకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. "21వ శతాబ్దం నరేంద్ర మోదీదే. సరైన సమయంలో దేశానికి దొరికిన సరైన నేత ఆయన. భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా కృషి చేస్తున్నారు. ఆయనను మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు అన్నారు.

ఈ సమావేశానికి తాను సైకిల్‌పై వచ్చానని, సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయని సూచించారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# మారుదాం... మార్చుదాం..!

చెన్నై: తమిళనాడు బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై శుక్రవారం తన సరికొత్త రాజకీయ ప్రస్థానాన్ని ఆరంభించారు. 'మారుదాం... మార్చుదాం'అనే నినాదంతో ఇకపై నూతన రాజకీయయాత్రను ఆరంభిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. బీజేపీ నుంచి వైదొలగాలన్న తన నిర్ణయాన్ని పార్టీ అధిష్టానం ఒప్పుకుందని, తన రాజీనామాను బీజేపీ అగ్రనాయకత్వం శుక్రవారం అంగీకరించిందని అన్నామలై వెల్లడించారు. తన రాజీనామా, కొత్త రాజకీయ ఉద్యమాల వివరాలను ఫేస్‌బుక్ లైవ్‌స్ట్రీమింగ్ ద్వారా అన్నామలై వెల్లడించారు. "నా మార్గం వేరు. నా లక్ష్యాలు చాలా పెద్దవి. రాష్ట్రంలో ఒక సరికొత్త రాజకీయ సంస్కృతిని, సమున్నతమైన మార్పును తీసుకురావాలన్నదే నా ఆశయం. రాష్ట్రంలో కొత్త రాజకీయ ఉద్యమం అత్యావశ్యకమైంది. ఇది పేరుకు సంబంధించినది కాదు ఒక ఆలోచనకు సంబంధించినది. మనల్ని మనం ముందుకుగా మార్చుకుందాం. తర్వాత సమాజంలో మార్పు దానంతట అదే వస్తుంది. మన ఉద్యమానికి పునాది మనం మారుదాం. అంతా మార్చేద్దాం. ఫక్తు రాజకీయాలను మనం తుదముట్టిద్దాం. సామాన్యుడి రాజకీయాలు చేద్దాం. ప్రజావసరాలే మనకు పరమావధిగా ఉండాలి. ఇప్పుడున్న రాజకీయ పార్టీలతో మనకు పోటీలేదు. ఎవరితోనూ పోటీపడేందుకు మనం లేం. అధికార పార్టీని, విపక్షాలను వాళ్ల రాజకీయాలు వాళ్లను చేసుకోనిద్దాం. మన సమయం వచ్చినప్పుడు మనం రాజకీయాలు చేద్దాం. మొదట రాజకీయ ఉద్యమాన్ని మొదలెడదాం. ఇందులో ఆసక్తి ఉన్నవాళ్లు ష్వీస్త్రవశ్రీఘుసవతీ. శితీస్త్ర పోర్టల్ ద్వారా వలంటీర్లుగా సభ్యత్వం తీసుకోండి. మీకు రాజకీయాలు నేరి?పస్తా. త్వరలో కోయంబత్తూర్‌లో ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ అండ్ పాలిటిక్స్ సంస్థను ఆరంభించి శిక్షణనిస్తా. నేటి నుంచి కొత్త పథం. కొత్త ఉద్యమం. కొత్త రాజకీయపోరాటం"అని వ్యాఖ్యానించారు. ష్వీస్త్రవశ్రీఘుసవతీ. శితీస్త్ర పోర్టల్‌కు అనూహ్య స్పందన మొదలైంది. గంటల వ్యవధిలోనే 10లక్షలకుపైగా సభ్యత్వం తీసుకోవడం విశేషం. "వ్యతిరేకించడం మన రాజకీయ వైఖరి కాదు. డీఎంకే, అన్నాడీఎంకే, ఎన్‌టీకే, సీమన్, పీఎంకే నేత అన్బుమణి, టీఎంసీ మూపనార్ జీకే వాసన్, ఏసీ షణ్ముగం, పారివేంద్రన్, జాన్ పాండియన్, కృష్ణస్వామి, వైగో, ప్రేమలతలను ఎలాగైతే ఇప్పుడు వ్యతిరేకిస్తానో ఇకపై బీజేపీనీ అలాగే వ్యతిరేకిస్తా. పార్టీని వీడేటప్పుడు తమిళనాడు పద్ధతి ప్రకారం గౌరవప్రదంగా కలిసి వివరించి బీజేపీ నుంచి నీ?రష్కమించా. కేంద్ర మంత్రి అమిత్ షా సహా అగ్రనేతలను కలిసి పార్టీ వీడుతున్నట్లు స్పష్టంగా చెప్పా. 18 నెలల క్రితమే 2024 డిసెంబర్ 4న పార్టీకి తొలిసారి వివరించా. వద్దు అని వారించారు. మే చివరిదాకా రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల బాధ్యతలు చూసుకోవాలని నన్ను ఆపేశారు. తమిళునిగా కొనసాగుతూ బీజేపీ నేతగా ఉండటం కష్టమైన పని"అని అన్నారు. "పార్టీని పటిష్టమైన ఉక్కులాంటి వ్యవస్థను తీర్చిదిద్దుతా. ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం మొదలు 30,000 స్థానిక సంస్థల్లోని ప్రతినిధుల దాకా ప్రతి ఒక్కరికీ పదవీకాలంపై పరిమితి విధిస్తా. ఎమ్మెల్యే, ఎంపీగా ఎన్నిసార్లు పోటీచేయొచ్చనే దానిపై పరిమితి తీసుకొస్తా. ఉద్యమం విజయవంతమయ్యాక రాజకీయ పార్టీగా మారి రాజకీయ ప్రస్థానం ఆరంభిస్తా. అధికార కుర్చీ ఎవరికీ శాశ్వతంకాదు. చివరకు నాక్కూడా. భారతీయునిగా కొనసాగుతూ తమిళుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తా.

# తమిళనాడులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్..

హైదరాబాద్ లోని గండిపేట పరిధిలో గల ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ఒక సంచలన మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో తలదాచుకున్న ఆయనను శుక్రవారం పోలీసులు వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అక్కడి నుండి హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం నిందితుడిని కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ హైప్రొఫైల్ అరెస్ట్ కోసం సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్, నార్సింగి పోలీసులు సంయుక్తంగా వ్యవహరించారు. అత్యంత రహస్యంగా ఆపరేషన్ నిర్వహించి బ్రహ్మనాయుడును పట్టుకున్నట్లు సైబరాబాద్ పోలీసులు అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ భూమిని చేజిక్కించుకునేందుకు నిందితులు పెద్ద స్కెచ్చే వేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ కేసులో కేవలం కబ్జా యత్నమే కాకుండా... భూమికి సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లను ఫోర్జరీ ద్వారా తయారు చేయడం, ప్రభుత్వ అధికారుల లేదా ఇతరుల సంతకాలను దుర్వినియోగం చేయడం, ఈ ల్యాండ్ స్కామ్ వెనుక జరిగిన కోట్ల రూపాయల నల్లధనం చేతులు మారడం వంటి కోణాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ భారీ భూ కుట్రలో బొల్లా బ్రహ్మనాయుడుతో పాటు తెరవెనుక ఉన్న ఇతర కుట్రదారులు, రాజకీయ నేతలు, కొందరు అధికారుల పాత్రపై కూడా ప్రస్తుతం లోతైన దర్యాప్తు కొనసాగుతోందని సైబరాబాద్ పోలీస్ శాఖ స్పష్టం చేసింది. ఈ అరెస్ట్‌తో హైదరాబాద్ చుట్టుపక్కల ల్యాండ్ గ్రాబింగ్ వ్యవహారాలపై మరోసారి చర్చ జోరందుకుంది.

## ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటాలి

ఈ అరుదైన మొక్కను పవన్ కల్యాణ్ తన తల్లి అంజనా దేవికి అంకితం ఇస్తూ నాటడం విశేషం. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు ఒక బహిరంగ విజ్ఞప్తి చేశారు. "మనకు జన్మనిచ్చిన తల్లిపై ప్రేమతో, గౌరవంతో ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరిట కనీసం ఒక్క మొక్కనైనా నాటాలి. మనమంతా కలిసికట్టుగా పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని కాపాడుకుందాం" అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అడవుల శాతాన్ని, పచ్చదనాన్ని భారీగా పెంచే లక్ష్యంతో పవన్ అత్యంత ప్రతిష్టాత్మకమైన 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఒక భారీ టార్గెట్‌ను నిర్దేశించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2.5 కోట్ల విత్తన బంతులను సిద్ధం చేసి పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ విత్తన బంతులను అటవీ ప్రాంతాలు, బంజరు భూములు, ప్రభుత్వ ఖాళీ స్థలాలలో చల్లడం ద్వారా సహజసిద్ధంగా అడవుల పునరుత్పత్తి జరిగేలా ప్లాన్ చేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలన్నా, పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నా ఇలాంటి హరిత కార్యక్రమాలు అత్యంత కీలకమని పవన్ నొక్కి చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ పచ్చని ఉద్యమంలో చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు.

# కేసీఆర్ చర్చకు అసెంబ్లీకి రా..

న్యాయం అడిగిన నిర్వాసితులను జైల్లో పెట్టి కొట్టించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే "మట్టికి పోయినా మనోడే పోవాలి" అని పెద్దలు చెప్పారని, మీ పాలమూరు బిడ్డగా కేవలం ఈ 30 నెలల కాలంలోనే జిల్లా ప్రాజెక్టుల కోసం రూ. 8 వేల కోట్లు ఖర్చు చేశానని సీఎం వెల్లడించారు. బిఆర్ఎస్ నాయకులు జైళ్లు కట్టాలని చూస్తే.. తాము పేద పిల్లల కోసం స్కూళ్లు కట్టాలని అనుకున్నామని, జిల్లాలో వలసలు ఆగి బతుకులు బాగుపడాలంటే చదువొక్కటే మార్గమని నమ్మి కొడంగల్‌లో భారీ ఎడ్యుకేషన్ హబ్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏం చేసిందని విమర్శిస్తున్న వారికి సీఎం రేవంత్ రెడ్డి లెక్కలతో సమాధానమిస్తూ.. తమ రెండున్నరేళ్ల పాలనలో 15 లక్షల కొత్త రేషన్ కార్డులు అందించామని, 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, అలాగే మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. తాము చేసిన అభివృద్ధిని చెప్పాలంటే రాస్తే రామాయణం, చెబితే భారతమంత ఉందని, ఈ క్రమంలోనే కేసీఆర్‌కు సవాల్ విసురుతూ.. "నీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. నీ పేరు కేసీఆర్ అయితే అసెంబ్లీకి రా, చర్చలో మాది తప్పని తేలితే నేను క్షమాపణ చెబుతా" అని సవాల్ విసిరారు. నిన్నమొన్నటి వరకు దొంగలకు సద్దులు మోసిన వాళ్లు ఇప్పుడు పాదయాత్రలు చేస్తామని మాట్లాడుతున్నారని, వారు పాదయాత్ర కాదు కాశీ దాకా పొర్లుదండాలు పెట్టినా చేసిన పాపాలు తొలిగిపోవని విమర్శించారు. పంచె కట్టుకుని ఇప్పుడు ఊళ్లలోకి వస్తే ప్రజలు ఉరికించి కొడతారన్న సీఎం, కేసీఆర్ రాసిపెట్టుకో.. పాలమూరు ప్రజలకు మట్టి తీసుడే కాదు, మట్టితో కప్పడం కూడా తెలుసని, రాబోయే రోజుల్లో పాలమూరు జిల్లాలో మీ పార్టీని బొంద పెడతాం, మీ వాళ్లని ఒక్కరిని కూడా ఎమ్మెల్యేగా గెలవనివ్వం అని హెచ్చరించారు. అలాగే గోదావరి జలాలపై చర్చిద్దామంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దాగుడుమూతలాడుతున్నారని, బీజేపీ నాయకులు ఇక్కడ తప్పించుకు తిరుగుతున్నారని దుయ్యబట్టారు. ఎవరు ఎన్ని డ్రామాలూ ఆడినా తుమ్మిడిహెట్టి కట్టి తీరుతామని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల నీటిని ఒప్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేస్తూ, జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు.

# ఏపీలో స్మార్ట్ సిటీలు.. రష్యాలో మంత్రి లోకేష్ కీలక భేటీ

ఆంధ్రప్రదేశ్‌లో సేఫ్ అండ్ స్మార్ట్ సిటీల నిర్వహణ కోసం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్.. సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వ రీజనల్ ఫారిన్ ఎఫైర్స్ విభాగం చీఫ్ ఎక్స్‌పర్ట్ పోలినా పోలుఖినాతో భేటీ అయ్యారు. ఈ భేటీలో ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి లోకేష్ స్వయంగా వెల్లడించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు లోకేష్ వివరించారు. ప్రధానంగా సేఫ్ ం స్మార్ట్ సిటీల నిర్మాణం కోసం పౌరులతో చర్చలు జరపడం, డేటా ఆధారిత నగర నిర్వహణ, డిజిటల్ విద్యను ప్రోత్సహించడం, నగరాల్లో విశ్వసనీయమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. ఏపీలో స్మార్ట్ సిటీల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం, అనుభవాన్ని పంచుకునేందుకు ఈ ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ దోహదపడుతుందని భావిస్తున్నారు.



## పర్యావరణ పరిరక్షణకు న్యూ ల్యాండ్ పరిశ్రమ హరిత సందేశం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటండి..
పర్యావరణాన్ని కాపాడండి అంటూ అవగాహన ర్యాలీ

**గుమ్మడిదల , జూన్ 5(నేటి ప్రస్థానం ):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడాలో గల న్యూ ల్యాండ్ పరిశ్రమ ఆధ్వర్యంలో గురువారం హరిత అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిశ్రమ ప్లాంట్ హెడ్ రమేష్ బాబు, కార్మికులు మరియు సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యూ ల్యాండ్ పరిశ్రమ నుంచి బొంతపల్లి కమాన్ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వారు "మొక్కలు నాటండి -- పర్యావరణాన్ని కాపాడండి", "పచ్చదనం పెంచండి -- భవిష్యత్తును రక్షించండి" వంటి నినాదాలు చేస్తూ ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల ప్రాధాన్యతను వివరించారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ మార్గంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపుదలకు తమ వంతు కృషి చేశారు. పరిశ్రమలతో పాటు సమాజం కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ వార్డు సభ్యులు



**జిన్నారం (గడ్డపోతారం), జూన్ 5 (నేటి ప్రస్థానం ):** గడ్డపోతారం పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా పి. తాన్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీడీఎం కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన ఆమె మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యులు నారబోయిన కుమార్, నారబోయిన శ్రీనివాస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నారబోయిన కుమార్ మాట్లాడుతూ, గడ్డపోతారం మున్సిపాలిటీలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డుల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ వంటి ప్రాథమిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమానంగా అందిస్తూ పారదర్శక పరిపాలన అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొంతపల్లి ఘర్షణ కేసులో ... ఎనిమిది మంది అరెస్ట్

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు.. కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలింపు

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి

ఇతర రాష్ట్రాల కార్మికుల వల్ల నిత్యం భయాందోళనలో... స్థానిక ప్రజలు

ఇతర రాష్ట్రాల కార్మికుల బాధ్యత పరిశ్రమలపై కాంట్రాక్టర్లపై ఉండాలని,ప్రజల డిమాండ్

ఇలాంటి ఘర్షణలు పునరావృతం అవకుండా చూడాలని ప్రజల విజ్ఞప్తి..

**గుమ్మడిదల, జూన్ 5 (నేటి ప్రస్థానం ):** గుమ్మడిదల మండల పరిధిలో చోటుచేసుకున్న ఘర్షణ ఘటనకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు గుమ్మడిదల పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, బొంతపల్లి గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ సాహు జూన్ 3వ తేదీ రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనతో పాటు తన కుమారులపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే ఘటనపై మరో వర్గానికి చెందిన దీప్ చంద్ కూడా పరస్పర ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా, కొందరు వ్యక్తులు కర్రలతో వీధుల్లో తిరుగుతూ ఘర్షణకు పాల్పడినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా దీప్ చంద్, సూరజ్, గోవింద్ దాస్, సోహిత్ కుమార్, అమర్ సింగ్, సంజీవ్, మోహిత్‌తో పాటు మరో అమర్ సింగ్‌ను అరెస్ట్ చేసి జిన్నారం కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం వారిని సంగారెడ్డి జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా గుమ్మడిదల ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చేవారు స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా లేదా భయాందోళనలు సృష్టించేలా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**స్థానికుల్లో భద్రతపై ఆందోళన.. చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**






బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చే కొందరి ప్రవర్తన స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందని పలువురు వాపోతున్నారు. కొందరు వ్యక్తులు మద్యం సేవించి గుంపులుగా వీధుల్లో సంచరిస్తూ గొడవలకు దిగుతున్నారనే ఫిర్యాదులు తరచూ వినిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణ ఘటనల నేపథ్యంలో ప్రజల్లో భద్రతపై మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో కూడా ఇదే ప్రాంతంలో తీవ్ర నేర ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ప్రవర్తనపై పర్యవేక్షణ బాధ్యత కాంట్రాక్టర్లు, సంబంధిత పరిశ్రమ యాజమాన్యాలపై కూడా ఉంటుందని స్థానికులు సూచిస్తున్నారు. కార్మికుల పూర్తి వివరాలు నమోదు చేయడం, వసతి గృహాల వద్ద నిఘా పెంచడం, తరచూ పోలీసు తనిఖీలు నిర్వహించడం ద్వారా శాంతిభద్రతల సమస్యలను నివారించవచ్చని పేర్కొంటున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత అధికారులు, పరిశ్రమ యాజమాన్యాలు, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఒక్కరోజే 1,860 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు విరూపాక్ష ఆర్గనైజ్ ముందడుగు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గడ్డపోతారం పారిశ్రామిక వాడలో హరిత కార్యక్రమం

**జిన్నారం (గడ్డపోతారం), జూన్ 5 ( నేటి ప్రస్థానం ):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని విరూపాక్ష ఆర్గనైజ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో మొక్కల నాటకం కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదల లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఒక్కరోజే 1,860 మొక్కలను నాటారు. పరిశ్రమ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిశ్రమ యాజమాన్యం, అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ, పచ్చని వాతావరణం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ హరిత కార్యక్రమం పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు పారిశ్రామిక వాడలో పచ్చదనం విస్తరణకు దోహదపడింది.





## రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు ను కలిసిన ఈర్ల రాజు ముదిరాజ్

**అమీన్పూర్ మున్సిపల్:** హైదరాబాదులో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును బీజేపీ నాయకుడు ఈర్ల రాజు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై నిర్వహిస్తున్న ఉద్యమాలు, సంస్థాగత బలోపేత చర్యలపై విస్తృతంగా చర్చించారు. స్థానిక స్థాయిలో పార్టీ విస్తరణకు తీసుకుంటున్న చర్యలను ఈర్ల రాజు ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడికి వివరించారు. రామచంద్రరావు మాట్లాడుతూ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా నాయకత్వం, ప్రజాప్రతినిధుల మార్గదర్శకత్వంలో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఈర్ల రాజు ముదిరాజ్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ భేటీ సానుకూల వాతావరణంలో జరగడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందని ఆయన వెల్లడించారు.

## ఇస్నాపూర్ పరిధిలో 4 నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కృషి

పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరువు,** :శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రజలకు లో వోల్టేజ్ సమస్య ఉత్పన్నం కాకుండా నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇస్నాపూర్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపల్ తో పాటు నాగులపల్లి, వెలిమెల, కొల్లూరు, భానూరు, నందిగామ, క్యాసారం పరిధిలో ఇటీవల పెద్ద ఎత్తున నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు.



## అడ్డగోలు ధరలతో ప్రజలపై భారీ భారం

భూముల మార్కెట్ విలువల పెంపుపై ఆగ్రహం..బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల:** రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను అమాంతం పెంచి ప్రజలపై భారీ ఆర్థిక భారం మోపుతోందని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సీజీఆర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని భూముల మార్కెట్ విలువలను 25 శాతం నుంచి 100 శాతం వరకు పెంచడం దారుణమని మండిపడ్డారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒక్కసారిగా ఇంత భారీ పెంపు చేపట్టడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనని పేర్కొన్నారు. భూముల కొనుగోలు, విక్రయాలతో పాటు రిజిస్ట్రేషన్లపై కూడా అదనపు భారం పడుతుందని తెలిపారు.పేద, మధ్యతరగతి ప్రజలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం మరింత కష్టతరంగా మారుతుందని, రైతులు భూముల కొనుగోళ్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# శామీర్‌పేట పెద్ద చెరువులో అక్రమ పైప్‌లైన్ ధ్వంసం

### భారీ కాలువ తవ్వకం.. రహస్యంగా వ్యవసాయ క్షేత్రానికి నీటి తరలింపు

### అక్రమ పైప్‌లైన్ల కూల్చివేత.. స్థానికుల్లో హర్షం

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల హెచ్చరిక







అక్రమ పైప్ లైన్ ను కూల్చివేయించిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు

**మేడ్చల్, (నేటి ప్రస్థానం):** ప్రభుత్వ అనుమతులు లేకుండా సహజ వనరులను స్వప్రయోజనాల కోసం వాడుకోవడం ముమ్మాటికీ చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. పూడూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని శామీర్‌పేట పెద్ద చెరువును ఆసరాగా చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నీటి దోపిడీకి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు అడ్డుకట్ట వేశారు. ఒక ప్రైవేట్ వ్యక్తి ఏర్పాటు చేసిన భారీ అక్రమ పైప్‌లైన్ నిర్మాణాలను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, జేసీబీ సహాయంతో పూర్తిగా ధ్వంసం చేశారు.

**భారీ కాలువ తవ్వకం.. రహస్యంగా వ్యవసాయ క్షేత్రానికి నీటి తరలింపు :** శామీర్‌పేట పెద్ద చెరువు చుట్టుపక్కల రైతుల సాగునీటి అవసరాలకు, భూగర్భ జలాల పెంపునకు ప్రధాన వనరుగా ఉంది. అయితే, స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ వ్యక్తి ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల నుండి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా, నిబంధనలను బేఖాతరు చేశాడు. చెరువు పరివాహక ప్రాంతం నుండి తన సొంత వ్యవసాయ క్షేత్రం వరకు భారీ కాలువ తవ్వి, అందులో పెద్ద ఎత్తున పైప్‌లైన్లను ఏర్పాటు చేశాడు. దీని ద్వారా చెరువులోని నీటిని అక్రమంగా తరలించేందుకు సిద్ధమయ్యాడు. ఈ వ్యవహారంపై స్థానిక రైతుల నుండి అధికారులకు ఫిర్యాదులు అందడంతో వెంటనే ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా స్పందించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్ రెడ్డి, ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ ఈర్షద్, జీపీఓ సునీతలు తమ సిబ్బందితో కలిసి అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. చెరువు పరిసరాలను, పైప్‌లైన్ వేసిన మార్గాన్ని పరిశీలించి ప్రభుత్వ ఆస్తులను, సహజ వనరులను దుర్వినియోగం చేస్తున్నట్లు నిర్ధారించుకున్న అధికారులు, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఆ అక్రమ నిర్మాణాలను అక్కడికక్కడే కూల్చివేయాలని ఆదేశించారు.

**అక్రమ పైప్‌లైన్ల కూల్చివేత.. స్థానికుల్లో హర్షం :**

అధికారుల సమక్షంలో సిబ్బంది రంగంలోకి దిగి చెరువు నుండి వ్యవసాయ క్షేత్రానికి అనుసంధానించిన పైప్‌లైన్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారు. కాలువను తిరిగి పూడ్చివేసేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ వనరులను ఆక్రమించి స్వప్రయోజనాలకు వాడుకోవాలని చూస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని అధికారులు ఈ సందర్భంగా నిరూపించారు. అధికారుల తక్షణ చర్య పట్ల స్థానిక రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

**కఠిన చర్యలు తప్పవు : అధికారుల హెచ్చరిక**

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి చెరువులు, కుంటల నుండి అక్రమంగా నీటిని తరలించడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయి. సహజ వనరులు అందరికీ సమానంగా చెందాలి. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇలాంటి అక్రమ తవ్వకాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ ఈర్షద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్ రెడ్డిలు హెచ్చరించారు.

# పచ్చదనం పెంపుదలే లక్ష్యంగా హెటిరో ల్యాబ్స్ ప్రత్యేక కార్యక్రమం

### పచ్చదనం పెంపుదల, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించిన పరిశ్రమ సిబ్బంది

**జిన్నారం (గడ్డపోతారం), జూన్ 5(నేటి ప్రస్థానం ):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ యూనిట్-1 ఆధ్వర్యంలో గురువారం మొక్కల నాటకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ యాజమాన్యం, అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరిశ్రమ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదల, వాతావరణ మార్పుల ప్రభావంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం, సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల పరిసరాల్లో పచ్చదనం పెంపుదలకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. నాటిన




మొక్కలను సంరక్షించి వాటి ఎదుగుదలకు సహకరిస్తామని పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పారిశ్రామిక వాడలో పర్యావరణ స్పృహను పెంపొందించేలా సాగింది.

# పర్యావరణ పరిరక్షణకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యత: జల్లి శైలజ హరినాథ్

### మేడ్చల్‌లో ఘనంగా “అమ్మ పేరిట ఒక్క మొక్క” కార్యక్రమం

### పర్యావరణ దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మొక్కల నాటకం

**మేడ్చల్, (నేటి ప్రస్థానం) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలనకు గుర్తుగా మేడ్చల్ పురపాలక బీజేపీ ఆధ్వర్యంలో “అమ్మ పేరిట ఒక్క మొక్క” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ పురపాలక బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పురపాలక బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజహరినాథ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గత 12 సంవత్సరాలుగా అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు, జాతీయ భద్రత, మహిళా సాధికారత వంటి అన్ని రంగాల్లో విశేష పురోగతి సాధించిందని కొనియాడారు. దేశ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా మోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. “అమ్మ పేరిట ఒక్క మొక్క” పిలుపుతో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి, ప్రకృతిని సంరక్షించాల్సిన



బాధ్యతను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీ గుప్త, బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు రాగం అర్జున్, మరియు యువమోర్చా జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ పురపాలక బీజేపీ ప్రధాన కార్యదర్శులు కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమ్ దాసు, ఎల్లంపేట పురపాలక బీజేపీ ప్రధాన కార్యదర్శి మహేష్, కిసాన్ మోర్చా నాయకులు చీర్ల సత్యనారాయణ, పురపాలక బీజేపీ ఉపాధ్యక్షులు సర్వేశ్వర రెడ్డి, మహిళా మోర్చా నాయకులు మల్లాది హేమలత రెడ్డి, తోట అనిత, పురపాలక బీజేపీ కార్యదర్శి డీ.సాయి, మరియు విష్ణు పాల్గొన్నారు.

# తుపాకీ వదిలి.. న్యాయశాస్త్రం వైపు అడుగులు..

### లాసెట్‌లో మెరిసిన మాజీ మావోయిస్ట్ నేత దేవ్‌జీ

**5 ఏళ్ల లా కోర్సులో 349వ ర్యాంకు సాధించిన దేవ్‌జీ**

**పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే తన లక్ష్యమని వెల్లడి**

**50 ఏళ్లు పైబడిన వయసులోనూ పట్టుదలతో చదివి అర్హత సాధించిన వైనం**



ఒకప్పుడు దండకారణ్యంలో తుపాకీ పట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన చేతులు ఇప్పుడు న్యాయశాస్త్ర పుస్తకాలు పట్టనున్నాయి. మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, తన కొత్త జీవిత ప్రయాణంలో కీలక అడుగు వేశారు. తెలంగాణలో నిర్వహించిన లాసెట్ (లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రవేశ పరీక్షలో ఆయన అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఐదేళ్ల న్యాయ విద్య కోర్సు కోసం రాసిన ఈ పరీక్షలో 57 మార్కులు సాధించి, 349వ ర్యాంకుతో అర్హత పొందారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పోలీసుల ఎదుట లొంగిపోయిన దేవ్‌జీ, జనజీవన స్రవంతిలో కలిసిన కొద్ది నెలల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం. 1980-82 మధ్యకాలంలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ (ఎంపీసీ) చదివిన ఆయనకు, అప్పట్లో తెలుగు సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదు. న్యాయ విద్య చదవాలన్న సంకల్పంతో ఇటీవలే ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొంది మే 13న ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష రాశారు. ఆ ఫలితాలు ఇంకా వెలువడక ముందే, లాసెట్‌లో మంచి ర్యాంకు సాధించడం ఆయన పట్టుదలకు నిదర్శనం. యాభై ఏళ్లు పైబడిన వయసులోనూ చదువుపై ఆసక్తితో ఈ విజయం సాధించిన దేవ్‌జీ, భవిష్యత్తులో లాయర్‌గా మారి పేద, నిరుపేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందించడమే తన లక్ష్యమని చెబుతున్నారు. మరోవైపు గురువారం విడుదలైన లాసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మొత్తం 73 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ పరీక్షకు మొత్తం 66,864 మంది దరఖాస్తు చేసుకోగా, 54,374 మంది హాజరయ్యారు. వీరిలో 39,673 మంది కన్వీనర్ కోటా సీట్లకు అర్హత పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం లా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరి అని స్పష్టం చేశారు.

## జనసేన రాజ్యసభ అభ్యర్థిని ఖరారు చేసిన పవన్ కల్యాణ్?

**ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు**

**టీడీపీ 3 స్థానాలు, జనసేన ఒక స్థానంలో పోటీ**

**చాలా కాలంగా లింగమనేని పేరును పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్**

ఏపీలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్డీయే కూటమి సీట్ల పంపకాలు పూర్తయ్యాయి. టీడీపీ 3, జనసేన ఒక స్థానంలో పోటీ చేయబోతున్నాయి. ఈ మేరకు కూటమి పెద్దలు నిర్ణయాన్ని ప్రకటించారు. ఇక జనసేన కోటాకు దక్కిన ఆ ఒక్క రాజ్యసభ స్థానం నుంచి పార్లమెంట్‌కు వెళ్లే అభ్యర్థిని ఆ పార్టీ దాదాపు ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరును జనసేన అధినేత పవన్ కల్యాణ్ దాదాపు ఖరారు చేశారని, ఈ సాయంత్రమే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/